నక్కవాగులో చెత్త తొలగింపు

- చిట్కుల్ డంపింగ్‌యార్డుకు చెత్త తరలింపు
- జీహెచ్‌ఎంసీతో టైఅప్‌కి సంప్రదింపులు
- ఆదేశాలిచ్చిన ఎంపీడీవో యాదగిరి

చిట్కుల్ నక్కవాగులో వేసిన చెత్తను తొలగిస్తున్న జేసీబీ

పటాన్‌చెరు, జూన్ 10: 'నక్కవాగులో చెత్త డంపింగ్' అంటూ సోమవారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామం నక్కవాగులో చెత్త వేస్తున్నారని వచ్చిన కథనంపై పటాన్‌చెరు ఎంపీడీవో యాదగిరి స్పందించి జేసీబీతో చెత్తను తొలగిస్తున్నారు. తొలగించిన చెత్తను ట్రాక్టర్ల ద్వారా గ్రామంలోని డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ చిట్కుల్ గ్రామం నక్కవాగులో చెత్తను పారవేయడంపై చర్యలు తీసుకొని జలవనరులను కాపాడుతామన్నారు. చెత్తను పూర్తిగా తొలగించి డంపింగ్ యార్డుకు తరలించాలని కార్యదర్శి కవితకు ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. జేసీబీ సాయంతో తొలగించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలిస్తున్నట్లు చెప్పారు. ఇక మీదుట నక్కవాగులో ఎలాంటి చెత్త వేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో ఉత్పత్తి అవుతున్న తడి, పొడి చెత్తను పునర్వినియోగించేలా కార్యచరణ రూపొందిస్తామన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, భూమిలో కలవని చెత్తను జీహెచ్‌ఎంసీకి తరలిస్తామన్నారు. త్వరలో జీహెచ్‌ఎంసీ అధికారులతో టైఅప్ అవుతామని తెలిపారు. స్వచ్ఛ భారత్ బృందంతో మాట్లాడి చెత్త రీసైక్లింగ్ యూనిట్‌ను మేజర్ పంచాయతీల్లో పెట్టించేందుకు ప్రణాళిక వేస్తున్నామన్నారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పంచాయతీల్లో పెద్దఎత్తున చెత్త ఉత్పత్తి అవుతున్నదని, చెత్త సమస్యను పరిష్కరించేందుకు జిల్లా అధికారుల సలహాలు, సూచనలు తీసుకుంటామన్నారు. డీఎల్‌పీవో చెత్త తొలగింపుపై సూచనలు చేశారని చెప్పారు. చెత్త తొలగించిన తర్వాత నక్కవాగును అధికారులతో కలిసి తనిఖీ చేస్తానని తెలిపారు. పంచాయతీలు జలవనరుల్లో చెత్తను వేయకుండా ఆదేశాలు ఇస్తున్నామన్నారు. చెత్తను తగులబెట్టిన పంచాయతీలపై చర్యలుంటాయని ఎంపీడీవో హెచ్చరించారు.

బాలకార్మికులను బడిలో చేర్పించాలి

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు పుస్తకాన్ని అందజేస్తున్న అంజయ్య

సదాశివపేట, జూన్ 10: బాల కార్మికులను బడిలో చేర్పించాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో రిటైర్డ్ మండల విద్యాధికారి దండు అంజయ్య రాసిన 'పేదల గురువు అంజయ్య బాల కార్మికుల విజయ గాథ' పుస్తకాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ నెల 15న ఉద్యోగ విరమణ సమావేశానికి రావాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్యోగానికి మాత్రమే విశ్రాంతి ఉందని, నిరంతరం బాల కార్మికులను బడిలో చేర్పించాలని సూచించారు. 2006 నుంచి మండలంలో ఉత్తమ బోధనతో పాటు బాలకార్మికులను బడిలో చేర్పించినందుకు అంజయ్యను అభినందించారు.

కోర్టు ఏర్పాటుకు భవనాల పరిశీలన

జిన్నారంలో కోర్టు ఏర్పాటుకు ఐకేపీ భవనాన్ని పరిశీలిస్తున్న అధికారులు, న్యాయవాదులు

జిన్నారం, జూన్ 10: మండల కేంద్రం జిన్నారంలో జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టును ఏర్పాటు చేసేందుకు సంబంధిత అధికారులు, న్యాయవాదులతో కలిసి సోమవారం భవనాలను పరిశీలించారు. జిన్నారంలోని పాత ప్రభుత్వ పాఠశాల భవనాన్ని, రెవెన్యూ కార్యాలయం ఆవరణలోని ఐకేపీ భవనాలను జిల్లా కోర్టు ఏవో శ్యామల, తహసీల్దార్ భిక్షపతి, జిన్నారం ఎంపీపీ రవీందర్‌గౌడ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి న్యాయవాదులతో కలిసి పరిశీలించారు. కోర్టు ఏర్పాటుకు ఐకేపీ భవనం అనువుగా ఉందని కోర్టు అధికారులు, న్యాయవాదులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఏవో త్వరలోనే జిల్లా జడ్జి భవనాన్ని పరిశీలించి నిర్ణయం తీసుకోనున్నారు. ఎంపీపీ రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ కోర్టుకు అనుకూలమైన భవనంలో మౌలిక వసతులను కల్పిస్తామన్నారు. న్యాయవాదులు అంజిరెడ్డి, శ్రీనివాస్, మధుశ్రీ, స్వరూపారాణి, ప్రకాశ్, నారాయణ, నాయకులు రాజిరెడ్డి, జనార్దన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

16న శ్రీరామ శిల శోభాయాత్ర

మాట్లాడుతున్న జ్యోతిర్వాస్తు విద్యాపీఠం వ్యవస్థాపకుడు మహేశ్వరశర్మ సిద్ధాంతి

సంగారెడ్డి, జూన్ 10: జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన శ్రీరామ శిల శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపకుడు మహేశ్వరశర్మ సిద్ధాంతి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని ఫసల్‌వాదిలోని జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 16న మధ్యాహ్నం ఒంటి గంటకు పోతిరెడ్డిపల్లి సంగమేశ్వర ఆలయం వద్ద శిల యాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు. యాత్రలో పది వేల మంది భక్తులు పాల్గొంటారన్నారు. రాత్రి 8 గంటలకు ఫసల్‌వాదీలోని జ్యోతిర్వాస్తు విద్యాపీఠానికి యాత్ర చేరుకుంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో విద్యాపీఠం సభ్యులు తోపాజీ అనంతకిషన్, ప్రశాంత్‌కుమార్, సెందిల్, విద్యాసాగర్ పాల్గొన్నారు.

ఎంపీపీ, ఎంపీటీసీలకు సన్మానం

ఎంపీపీ, ఎంపీటీసీలను సన్మానించిన మండల అధికారులు

కొండాపూర్, జూన్ 10: మండల కేంద్రమైన కొండాపూర్‌లో ఎంపీపీ మనోజ్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం సర్వసభ్య సమావేశంలో భాగంగా ఎంపీపీ, ఎంపీటీసీల ఆత్మీయ అభినందన సభ ఏర్పాటు చేశారు. ఎంపీటీసీల పదవీకాలం మరికొన్ని రోజులు ఉన్నా చివరి సమావేశం కావడంతో ఆత్మీయ అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మనోజ్‌రెడ్డి మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో తన పదవీకాలాన్ని విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. అభివృద్ధిలో సహకరించిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. సీడీపీ నిధుల నుంచి స్థానిక ఎమ్మెల్యే ప్రతి గ్రామానికి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు మంజూరు చేయిస్తే గ్రామాల్లో సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఎంపీడీవో జ్యోతిలక్ష్మి, వైస్ ఎంపీపీ లక్ష్మీరాంచందర్, డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్, సొసైటీ చైర్మన్లు శ్రీకాంత్‌రెడ్డి, రాజు, పవన్‌కుమార్, సర్పంచ్‌ల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు రుక్మొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల బిల్లులు చెల్లించాలి

అధికారులను ప్రశ్నిస్తున్న ప్రజాప్రతినిధులు

మునిపల్లి, జూన్ 10: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపులో ఎందుకు ఇంత నిర్లక్ష్యం చేస్తున్నారని మునిపల్లి మండల పరిషత్ అధ్యక్షురాలు శైలజాశివశంకర్, జడ్పీటీసీ మీనాక్షిసాయికుమార్ అధికారులను ప్రశ్నించారు. స్పందించిన పంచాయతీ రాజ్ ఏఈ తన హయాంలో జరిగిన ప్రతి పనికి బిల్లులు మంజూరయ్యాయని తెలిపారు. సోమవారం మునిపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మునిపల్లి మండలంలోని అన్ని శాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. ఎంపీటీసీలు, జడ్పీటీలకు చివరి సమావేశం కావడంతో పదవిలో సహకరించిన అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

విద్యార్థులకు బంగారు పతకాలు

పతకాలు పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కోహీర్, జూన్ 10: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సీఎం రేవంత్‌రెడ్డి పతకాలను అందజేశారు. సోమవారం హైదరాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో వందేమాతరం సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో పురస్కారాలను అందజేశారు. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని దిగ్వాల్ జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన సాయిచరణ్, తులసి పదో తరగతి వార్షిక పరీక్ష ఫలితాల్లో పది జీపీఏ సాధించారు. దీంతో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సీఎం బంగారు బహుమతులను అందజేశారు. హెచ్‌ఎం జాకీర్‌హుస్సేన్, తల్లిదండ్రులు ఉన్నారు.

దామరచెరువులో నీటి శాంపిల్స్ సేకరిస్తున్న పీసీబీ అధికారి రవీందర్

చెరువులు, కుంటల్లో నీటి శాంపిల్స్ సేకరణ

బొల్లారం, జూన్ 10: పలు పరిశ్రమల యాజమాన్యాలు రసాయన వ్యర్థాలను చెరువులు, కుంటల్లోకి యథేచ్ఛగా విడుదల చేస్తున్నారని స్థానికులు పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులపై స్పందించిన పీసీబీ అధికారి కుమార్‌పాటక్ ఆదేశాల మేరకు సోమవారం పీసీబీ ఏఈఎస్ రవీందర్ మున్సిపాలిటీలో పర్యటించి చెరువులు, కుంటలను పరిశీలించారు. మాధవానికుంట, దామర చెరువు, రేండ్ల కుంట, ఆసానికుంటలో నీటి శాంపిల్స్ సేకరించారు. శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించి టెస్ట్ చేసి వచ్చిన రిపోర్టుల ఆధారంగా సదరు పరిశ్రమలపై చర్యలు తీసుకుంటామని అధికారి స్పష్టం చేశారు. పర్యావరణానికి హాని కలిగిస్తే, ఇష్టారీతిన చెరువులు, కుంటల్లోకి రసాయన వ్యర్థ జలాలను విడుదల చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పిసిబి సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

కార్యకర్తకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ


పరామర్శిస్తున్న భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, జూన్ 10: కృష్ణాపూర్ మొదల్‌కుంటతండాకు చెందిన రాములనాయక్‌కు విద్యుత్‌షాక్‌కు గురై నారాయణఖేడ్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. సోమవారం ఆయనను నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే బీఆర్‌ఎస్ నాయకులు రవీందర్‌నాయక్, పరమేశ్, నజీబ్, బషీద్, అభిషేక్‌శెట్కార్, నగేశ్‌సేట్ ఉన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన ఢిల్లీ వసంత్

కోహీర్, జూన్10: గోవా పార్లమెంట్ సభ్యుడు, కేంద్ర సహాయ మంత్రి శ్రీపాద్ నాయక్‌కు సోమవారం జహీరాబాద్ ప్రజల తరఫున ఢిల్లీ వసంత్‌కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. కేంద్ర సహాయ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినందుకు ఢిల్లీలో ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

రాయికోడ్: మహ్మదాపూర్‌లో బాడిబాట ర్యాలీ

న్యాల్‌కల్, జూన్ 10: ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని మండల విద్యాధికారి మారుతీరాథోడ్ అన్నారు. బాడిబట కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని హద్నూర్, ఖలీల్‌పూర్, మామిడ్గి, మెటల్‌కుంట, చాల్కి, రేజింతల్ తదితర గ్రామాల్లో విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక వసతులతోపాటు విద్యార్థులకు ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ఆంగ్ల విద్యను బోధిస్తున్నామన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు సన్నబియ్యంతో భోజనం, ఉచితంగా పుస్తకాలు, యూనిఫామ్ అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతిభ గల ఉపాధ్యాయులతో విద్యా బోధన ఉంటుందన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

వట్‌పల్లి, జూన్ 10: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సింహులు అన్నారు. మండల పరిధిలోని ఉసిరికపల్లిలో బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే సౌకర్యాల గురించి వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. ఉపాధ్యాయుడు సుధాకర్ ఉన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా బోధన

రాయికోడ్, జూన్ 10: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్య బోధన అందుతుందని ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం యాదుల్ అన్నారు. మండల పరిధిలోని మహ్మదాపూర్ గ్రామంలో బాడిబాట ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. ర్యాలీలో అంగన్‌వాడీ టీచర్ సంగీత, గ్రామ పెద్దలు దుర్గయ్య, రాజు, శ్యామయ్య తదితరులు ఉన్నారు.

వట్‌పల్లి: ఉసిరికపల్లిలో బడిబాటలో ఉపాధ్యాయులు

న్యాల్‌కల్: హద్నూర్‌లో బడిలో చేర్పించాలని కోరుతున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయులకు పాఠ్యపుస్తకాలు అందజేత

కోహీర్: హెచ్‌ఎంలకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న ఎంఈవో శంకర్

కోహీర్, జూన్ 10: ప్రాథమిక, ప్రాథమికోన్నత, జడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను సక్రమంగా అందించాలని మండల విద్యాధికారి శంకర్ ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. సోమవారం కోహీర్ పట్టణంలోని మండల వనరుల కేంద్రంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు.

సదాశివపేటలో..

సదాశివపేట, జూన్ 10: ఎంఈవో శంకర్ ఆధ్వర్యంలో సోమవారం ఉపాధ్యాయులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమైన రోజు విద్యార్థులకు పుస్తకాలను అందజేయాలన్నారు. మంగళవారం మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు పుస్తకాల పంపిణీ ఉంటుందని తెలిపారు.

న్యాల్‌కల్‌కు చేరుకున్న పుస్తకాలు

న్యాల్‌కల్, జూన్ 10: మండలంలోని 67 ప్రభుత్వ పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో చదివే విద్యార్థులకు 17 వేల పాఠ్య పుస్తకాలు, నోటు బుక్కులు సోమవారం మండలానికి వచ్చాయి. మంగళవారం మండల కేంద్రమైన న్యాల్‌కల్ ఎమ్మార్సీ కార్యాయలంలో వాటిని సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంలకు అందజేయనున్నట్టు మండల విద్యాధికారి మారుతీరాథోడ్ తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎమ్మార్సీ కార్యాలయానికి హెచ్‌ఎంలు వచ్చి పాఠ్య పుస్తకాలు తీసుకెళ్లాలని సూచించారు.

జిల్లాలో భారీ వర్షం

పిడుగుపాటుకు ఒకరు మృతి

సంగారెడ్డి కలెక్టరేట్/రాయికోడ్, జూన్ 10: జిల్లాలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. పుల్కల్ మండలం లక్ష్మీసాగర్‌లో 113.5మిల్లీ మీటర్ల వర్షం కురవగా, హత్నూర మండలం గుండ్లమాచునూర్‌లో 52.3మిల్లీ మీటర్లు, రాయికోడ్‌లో 47.5 మిల్లీ మీటర్లు, పుల్కల్‌లో 37, కందిలో 31.5, కోహీర్ మండలం దిగ్వాల్‌లో 29.5, న్యాల్‌కల్‌లో 28.3, మనూర్‌లో 28, కోహీర్‌లో 26.8, హత్నూరలో 19.5 మిల్లీ మీటర్లు కురిసింది. జిల్లాలోని మిగతా ప్రాంతాల్లో ఓ మోస్తారు వర్షం నమోదైంది. రాయికోడ్ మండల పరిధిలోని కోడూరులో విత్తనాలు నాటుతుండగా పిడుగు పడగా ఇద్దరికి గాయాలయ్యాయి. వారిని దవాఖానకు తరలిస్తుండగా యాస్మిన్ బేగం(19) మృతి చెందింది. మరో మహిళ అనూషమ్మను సంగారెడ్డి దవాఖానకు తరలించారు.

యాస్మిన్‌బేగం(ఫైల్)

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

ఎల్‌ఐజీ వార్డు కార్యాయలంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి

రామచంద్రాపురం, జూన్ 10: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ సింధూఆదర్శ్ రెడ్డి అన్నారు. సోమవారం డివిజన్‌లోని ఎల్‌ఐజీలో ఉన్న వార్డు కార్యాలయంలో డివిజన్ అభివృద్ధిపై వార్డు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎల్‌ఐజీలో మంజూరైన సీసీ రోడ్లను త్వరగా ప్రారంభించాలని ఏఈకి కార్పొరేటర్ సూచించారు. అదేవిధంగా అవసరమైన చోట అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఆయా కాలనీల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మాన్సూమ్, ఎంటమాలజీ సిబ్బందిని అప్రమత్తంగా ఉంచాలని ఆయా శాఖల అధికారులను కార్పొరేటర్ ఆదేశించారు. డివిజన్‌లో ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తమ దృష్టికి లేదా వార్డు కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్‌ఐజీ కాలనీ అధ్యక్షుడు యాదగిరిరెడ్డి, డైరెక్టర్లు లక్ష్మణ్, రాంబాబు, వార్డ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ఆర్సీపురం వార్డు కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పుష్పానగేశ్

రామచంద్రాపురం, జూన్ 10: ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి పెట్టాలని ఆర్సీపురం డివిజన్ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పానగేశ్ అన్నారు. సోమవారం డివిజన్‌లోని శ్రీనివాస్‌నగర్‌కాలనీలోని వార్డు కార్యాలయంలో బల్దియా, వాటర్ వర్క్స్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పలు కాలనీల్లో ఓపెన్ డ్రైన్ పనులు మంజూరైనప్పటికీ ఇంకా పనులు ప్రారంభించలేదని, వెంటనే కాంట్రాక్టర్లతో చర్చించి పనులు ప్రారంభించాలని డీఈ, ఏఈకి సూచించారు. వర్షాకాలంలో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఎంటమాలజీ సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా చూడాలని వాటర్ వర్క్స్ డీజీఎం, మేనేజర్‌ను ఆదేశించారు. వీధి దీపాలు వెలుగుతున్నాయో లేదో అని విద్యుత్ శాఖ సిబ్బంది పర్యవేక్షించడం లేదని, వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కాబట్టి అధికారులందరూ అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సురేశ్, అధికారులు పాల్గొన్నారు.

'మిషన్ భగీరథ'పై ఇంటింటి సర్వే చేయాలి

న్యాల్‌కల్, జూన్ 10: మండలంలోని గ్రామాల్లో మంగళవారం మిషన్ భగీరథ పథకంపై ఇంటింటి సర్వే చేపట్టాలని మండల అభివృద్ధి అధికారి సురేశ్ తెలిపారు. మండలంలోని 37 గ్రామ పంచాయతీ పరిధిలోని 11 వేలకుపైగా మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లు ఉన్నాయన్నారు. ఈ సర్వేలో ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారుల నుంచి ప్రతి రోజూ తాగునీరు వస్తుందా? ఏవైనా సమస్యలున్నాయా.. అదనంగా మరో కనెక్షన్ అవసరం ఉందా? అనే వివరాలపై ఆరా తీసి ఫొటోలతో ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. పదిరోజుల్లో సర్వేను పూర్తి చేయాలన్నారు.

యువకుడి అదృశ్యం

కల్హేర్, జూన్ 10: యువకుడు ఇంట్లో నుంచి బయటకు వెళ్లి నెల రోజులు గడిచినా తిరిగి ఇంటికి రాకపోవడంతో మిస్సింగ్ కేసు నమోదైంది. ఈ ఘటన బుగ్య తండాలో చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటేశం తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేట్ మండలం కాల్వోని కుంటతండా పంచాయతీ పరిధిలోని బుగ్యనాయక్ తండాకు చెందిన కేతావత్ జైపాల్(27) మతిస్థిమితం కోల్పోయి పిచ్చిపిచ్చిగా వ్యవహరిస్తుండే వాడు. ఇంటి నుంచి బయటకు వెళ్లి నెల రోజులు గడిచిపోయింది. అప్పుడప్పుడూ ఇంటి నుంచి వెళ్లి తిరిగి వచ్చేవాడని, నెల రోజుల తర్వాత తిరిగి ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల గ్రామాలు, బంధువుల ఇండ్లలో కూడా సమాచారం లేకపోవడంతో భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశం తెలిపారు.

నాణ్యమైన విత్తనాలను విక్రయించాలి

కోహీర్, జూన్ 10: నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని జహీరాబాద్ డివిజన్ వ్యవసాయాధికారి భిక్షపతి ఆదేశించారు. సోమవారం కోహీర్, కవేలి, పోతిరెడ్డిపల్లి గ్రామాల్లోని ఫర్టిలైజర్ దుకాణాల్లో ఆయన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణాల్లో నకిలీ ఎరువులు, విత్తనాలు, మందులు అమ్మితే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని సూచించారు. కొనుగోలు చేసిన రైతుల ఆధార్ నంబర్‌ను తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. ఆత్మ బీటీఎం చరణ్, ఫర్టిలైజర్ డీలర్లున్నారు.

ఆర్థికసాయం అందజేత

బొల్లారం, జూన్ 10: అనారోగ్యం బారిన పడి కాళ్లు కోల్పోయిన బాధితుడికి సోనుసూద్ చారిటీ సభ్యుడు, బొల్లారం మున్సిపల్ యువత నాయకుడు ప్రవీణ్‌రెడ్డి ఆపదలో అండగా నిలిచారు. సూర్యాపేట జిల్లా సింగిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన ఆకుల రాజు శరీరంలో క్యాల్షియం తగ్గిపోవడంతో కాళ్లు పడిపోయాయి. దీంతో రాజు లేవలేని స్థితిలో మంచానికే పరిమితమయ్యాడు. సోషల్‌మీడియా ద్వారా సోమవారం విషయం తెలుసుకున్న ప్రవీణ్‌రెడ్డి బాధితుడి వద్దకు వెళ్లి పరామర్శించారు. వైద్య ఖర్చులకు రూ.5 వేలు అందించారు. కష్టకాలంలో తోడుగా నిలిచిన చారిటీ సభ్యులకు, యాక్టర్ సోనుసూద్‌కు బాధితుడు ధన్యవాదాలు తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ

నారాయణఖేడ్, జూన్ 10: మాదిగ జన సభ పోస్టర్‌ను సోమవారం నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి తన స్వగృహంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాదిగ జేఏసీ నియోజకవర్గ ఇన్‌చార్జి పగిడిపల్లి రమేశ్ మాట్లాడుతూ ఈనెల 15వ తేదీన నారాయణఖేడ్ పట్టణంలోని మున్సిఫ్‌కోర్టు వెనకాల ఎస్సీ కాలనీలో ఈసభ ఉంటుందని తెలిపారు. మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిడమర్తి రవి మాదిగల కొరకు 12 శాతం రిజర్వేషన్ కేటాయించాలని డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈసభకు మాదిగలు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ వైస్ చైర్మన్ దారం శంకర్, వార్డు కౌన్సిలర్లు నిర్సంహులు, సద్దాం మాదిగ జేఏసీ నాయకులు మనోహర్, కిరణ్ , సుకుమార్, రాములు, మోసిన్ పాల్గొన్నారు.

శ్మశానవాటిక కబ్జాపై చర్యలు తీసుకోవాలి

అమీన్‌పూర్, జూన్ 10: అమీన్‌పూర్ మండలం పటేల్‌గూడలోని సర్వే నంబర్ 237లో రెండున్నర గుంటల విస్తీర్ణం గల దళితులకు చెందిన శ్మశానవాటిక భూమిని గ్రామానికి చెందిన కొంత మంది కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని దళితులు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ వల్లూరు క్రాంతిని కలిసి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ తమ పూర్వీకుల నుంచి ఉన్న స్థలాన్ని కబ్జా చేయడమే కాకుండా సమాధులను సైతం ధ్వంసం చేశారని తెలిపారు. కూల్చివేతల సమయంలో అడ్డుకొని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆ భూమిని ప్రభుత్వం తమకు కేటాయించిందని, సదరు వ్యక్తులు చెబుతున్నారని, అధికారులు పూర్తి విచారణ జరిపి రికార్డుల్లో ఎవరి పేరిట భూమి ఉంది అనే విషయాన్ని స్పష్టం చేసి ప్రైవేట్ వ్యక్తుల పేరుపై ఉంటే రద్దు చేయాలని కోరారు.